# ఊళ్ళెకు బస్సొచ్చింది

"సీతాలూ, సీతాలూ! ఇది ఇన్నావె!..." తడిక చాటున స్నానం చేస్తున్న సీతాలును అడిగింది భద్రమ్మ.

"ఏం సంగతి భద్రక్కా, సుందరమ్మ నీళ్ళు పోసుకున్న సంగతా?..." నీళ్ళు పోసుకోవడం ఆపి అడిగింది సీతాలు.

"కాదు...ఏది, తడ్క తీయి"

"అమ్మో!"

"వీపు రాస్త తీయి సెల్లె..."

"గా పెద్ద దర్వాజ తలుపేసినవా?"

"ఆఁ..."

సీతాలు తడిక పక్కకు జరిపింది.

భద్రమ్మ ఆ తడికల బాత్‌రూమ్‌లో దూరి తోటి కోడలు సీతాలు వీపురాసింది. వేడి వేడి నీళ్ళు పోసింది.

"ఇంగ మన కట్టాలు గట్టెక్కుతాయి సెల్లె..." అంది.

"ఎట్టెట్ల?" ఆశ్చర్యంగా అడిగింది సీతాలు.

"అయితే ఈ సంగతి నువ్వు ఇన్నేలేదా?" తలగోర్ల కొడుతూ అంది భద్రమ్మ.

"ఉహూఁ... మోటబాయి పూడ్కె తీస్తాండ్లా..."

"అది కాదే."

అసలు సంగతి ఏవిటో చెప్పింది భద్రమ్మ.

"అట్లనా అక్కా!"

సీతాలు మొహం విప్పారింది.

ఆమెకు తల్లిగారి ఊరు చేరుకున్నంత ఆనందం కలిగింది.

***

"చూదు సావుకారీ – గీ రుసరుసలు గుసగుసలు ఇడ్సిపెట్టు... నువ్వు మా సొమ్ముల్తోనె పెద్దోడివైనవని బాగ యాదికి పెట్టుకో... అయితె అయినవు... మేమేం నీ ఆస్తిని గుంజుకుంటలేం...జెర మమ్మల్ని మదుసుల్ని సూసినట్టు సూడవయ్యా. బొత్తిగా ఈగల్ని దోమల్ని పుర్రచేత్తో తోలినట్లు తోలకు..."

పెంచలయ్య మాటలకు షావుకారు పెద్ద మార్కండేయకు పెద్ద కోపమే వచ్చింది. తల తిరిగినంత పనయింది.

"చూసినవా చూసినవా – పూటగ్గతి లేనోడికి గూడా ఎంత నీల్గుడో! వీడినేమన్న, జెర అగురా అవుతల పెద్ద ఎచ్చాలు ఇస్తాన్న అంటే చూసినవా ఎట్లా మాట్లాడుతాండో..."

చూసినవా అని షావుకారు అడిగిన ఆ వ్యక్తి పేరు గురవయ్య. గుమ్మడిపండు లాంటి మనిషి. అతని మనసు గోడమీది పిల్లి. అరువుకోసం షావుకారు దుకాణానికి వచ్చాడు. అతనికే కదా వత్తాసు పలికేది?

"ఏందిరా పెంచలిగా, పెద్దంత్రం లేదు. చిన్నంత్రం లేదు. నోటికొచ్చినట్టు మాట్లాడుడేనా!" అని పెంచలయ్యనే మందలించాడు గురవయ్య.

"అనువుగాని చోట..." అనే పద్యం పెంచలయ్య చదవలేదు కాని ఆ భావం అతనికి తెలుసు.

బుడ్డెడు కిరసనాయలు, అగ్గిపెట్టె తీసుకొని వెళ్ళిపోయాడు.

"అవ్‌గాని షావుకారి. గీ సంగతి నిజమేనా?" గురవయ్య షావుకారిని అడిగాడు.

"ఏ సంగతి?"

చెప్పాడు గురువయ్య.

"హూఁ..." నిట్టూర్చాడు షావుకారు.

"అవునట. ఏం ఒరగబెడ్తదో సూద్దాంలే..." వెటకారంగా బొజ్జ ఊపుకుంటూ అన్నాడు.

***

జీలుగుబెండ్లు చంకలో పెట్టుకొని కుంటకట్టకు పోతున్న సారంగం పారెమ్మ కొడుకు కరీంను చూసి అడిగాడు.

"అరేయ్, ఈత కొడ్తాం వొత్తవా?" అని.

"వొత్తగాని మా అవ్వకు తెలిస్తే తంతదిరా" దిగులుగా అన్నాడు కరీం.

"ఎందుకురా... నీకు ఈత వొత్తది కదా!"

"అవ్. వొత్తది. అయినా కుంట్లకు దిగద్దు అంటది. నాకు పడిశం పద్తదట."

"హాచ్..." అని తుమ్మాడు సారంగం.

"పడిశమ!" అడిగాడు కరీం.

"అఁ..."

"మరి ఈతకు బోతాన్నవేందిరా!"

"ఈత కొడ్తె పడిశం బోతదట..." అన్నాడు సారంగం.

"మీ అవ్వ చెప్పిందా?"

"ఊహూఁ కాదు. మా అప్పయ్య."

"మరే... మీ అప్పయ్యకు బగ్గ ఈత వొత్తదట కదా."

"అఁ..." సంబరంగా చూశాడు సారంగం తన చిన్నాయన గురించి కరీం గొప్పగా మాట్లాడ్డం విని.

"అయితే మీ అప్పయ్యనే తీస్కపో. నే(న)ాను.. ఇయ్యాల మా అవ్వ మాట ఇనకపోతే ఎల్లుండి పేటకు తీస్కపోదు."

"ఎల్లుండి పేటకు బోతన్నవా?"

"ఆఁ... ఎట్ల పోతనో నీ కెర్కేనా?"

"ఎట్ల?"

అదేవిటో చెప్పాడు కరీం.

కుతూహలంగా విన్నాడు సారంగం.

"అయితే నేను మా అయ్యతాన ఏడుస్త పేటకు తీస్కపొమ్మని."

"మీ అయ్య సరే అంటడా – తీస్కపోతనంటడా!"

"అవల్రైట్‌గా తీస్కపోతడు – గా పొద్దున సమ్మక్క తీర్థం వొత్తనని ఏడు స్తె తీస్కపోలే?"

"అవ్ – మరి బగ్గ ఏడువు.నువ్వు గూడా మాతోని పేటకు వొత్తువు."

తలూపాడు సారంగం. కుంటదారి వదిలి ఇంటి దారి పట్టాడు. ఆ పిల్లాడికి ఇప్పుడు ఈత మీద మనసు లేదు. చంకలోని జీలుగుబెండ్లు బరువైపోయాయి.

***

ముల్లుగర్రతో "హడీ – హడీ" అని గొడ్లను అదిలిస్తున్న ఓదెలు. తన మందను తొలుకొచ్చిన యాదగిరితో అన్నాడు. "అరేయ్ యాది,యాది, గీ సంగతి విన్నావ్?"

"ఏ సంగతి?"

"మన ఊళ్ళెకు బస్సొత్తాందట!"

"అఁ... అఁ... రోడ్డు ఏ సిండ్లు గదా...బస్సొంత్తాందట. ఊళ్ళె ఏడజూసినా గిదే ముచ్చట. ఊళ్ళెకు బస్సొత్తాందంటె సద్దులు, దసర పండుగ వచ్చినంత సంబరపడుతాండ్లు జనం."

"అవ్ మల్ల... ఊళ్ళెకు బస్సొత్తాంటే సంబరం కాదా – ఆమెడ, రెండామెడల దూరం బోయి బస్సెక్కబడ్తిమి."

"అవుగాని ఓదిగా, మీ అయ్య దసరకు కోసి పొగులెయ్యదానికి రొండు యాటల్ని మేపుతాండట కదా!"

"అవ్, ఈపాలి పండుగెల్లిన రొండు రోజుల్దాక మా ఇంట్ల చియ్యబువ్వే" చంకలు కొట్టాడు ఓదెలు.

"పండుగకు పేట నుంచి మా అక్క వొత్తది. బావ వొత్తాడు. మాఇంట్ల పెద్దగ అయితాదనుకో ఈపాలి పండుగ."

"మీ అక్కతోని పేటకు పోతనంటిని గదా... మరి పోతవా?" అని అడిగాడు ఓదెలు.

"ఏమ్మో నాకైతే పోవాల్ననె ఉన్నది. కాని మా అయ్య గొడ్లను ఇడ్సిపెట్టి పోనిస్తాడు?" విచారంగా అన్నాడు యాదగిరి – "ఊళ్ళెకు బస్సొచ్చినా మనకేం వొరుగుతది సెప్పు. గొడ్లను ఇడ్సి ఏడికి పోతం?"

***

"ఇప్పటి మాటా, అప్పటి మాటా! నేను సమర్తయి కాపురానికి వచ్చినప్పట్నించి అనుకుంటాండ్లు - మన ఊళ్ళెకు బస్సొస్తది, బస్సొస్తది అని. ఇన్నేండ్లాయె. నలుగురు బిడ్డల తల్లినైతిని. కాలినడకనే తల్లిగారింటికి పోతిని. అత్తగారింటికి వొస్తిని. గిన్నేండ్లకు గిప్పుడొస్తాంది బస్సు! బస్సుకు పోవాలంటేఎంత యాతన పడ్డిమి! ఎంత దూరమో నడిచిపోతిమి. ఒక రోగమొచ్చినా, నొప్పి వచ్చినా జెప్పున పేటకు పోవాల్నంటె ఎంతో ఇద్దైపోతిమి... అదెపాయె ఇన్నాళ్ళకుగా దేవునికి మన మీద దయ గలిగింది... ఊళ్ళెకు బస్సొత్తాంది."

With best comp... SRI VEDAGIRI ...CATION... Chikkadpally, 1-8-391/... HYDERABAD-500 020.

శాంతమ్మ, వెంకటమ్మ తమ ఊరికి రాబోతున్న బస్సు గురించి మాట్లాడు కుంటున్నారు.

చిన్న పిల్లల నుంచి పెద్దల దాకా ఆ ఊరి జనం ఎక్కడ చూసినా తమ ఊరికి రాబోయే బస్సు గురించె చెప్పుకుంటున్నారు.

ఊరి జనమంతా పదిహేనవ తేదీ ఆగస్టు కోసం ఎదురుచూస్తున్నారు. ఆ రోజే ఊరికి బస్సువచ్చేది. మహానుభావుడెవరో తమ పేద గుడిసెకు వేంచేస్తున్నంత ఆనందపడు తున్నారు. దేవుడే దిగివచ్చి వరాలు ఇవ్వబోతున్నట్లు సంబరపడుతున్నారు.

అలా సంబర పడనివాడు పానకాలరావు ఒక్కడే!

పానకాలరావు కొంతకాలం ఆ ప్రాంతానికి ఎమ్.ఎల్.ఏగా ఎన్నికయ్యాడు. వరసగా మూడుసార్లు ఎన్నికయ్యాడు. ఈసారి మాత్రం పానకాలరావు గెలవలేదు. అతని ప్రత్యర్థి పరమేశం గెలిచాడు.

పానకాలరావుకు ఆ ఊరికి బస్సు రావడం ఇష్టం లేదు. పైగా కష్టంగా కూడా ఉంది.

"అయ్యా పానకాలరావుగారూ! ఊళ్ళోకి బస్సొస్తున్నది అంటె ప్రజా సేవకులైన మీరు సంతోషపడాల్సింది పోయి ఇంత బెంగపెట్టుకున్న రేవిటండి?"అతని సన్నిహితుడు సుందరమూర్తి అడిగాడు.

"బెంగ కాదూ మరి! ఎవరి హయాంలో ఈ ఊరికి బస్సు వస్తున్నది. నా హయాంలో కాదు గదా! పరమేశంగాడి హయాంలో వస్తున్నది. ఈ దెబ్బతో జనంలో వాడి పలుకుబడి ఇంకా పెరిగిపోదూ! వచ్చే ఎలక్షన్లలో కూడా వాడే గెలవడూ?"

"ఓహో అదా తవరి బెంగ! ప్రజా నాయకులు, ప్రజా సేవకులు అంటే ఎప్పుడూ ప్రజల బాగుగురించే ఆలోచించేవాళ్ళు అనుకున్నా. కాదన్న మాట! ఎప్పుడు ఎలక్షన్ల

గురించే ఆలోచించే వాళ్లన్న మాట!" అనుకున్నాడు సుందరమూర్తి.

"అక్కడికి ఎన్ని అడ్డంకులు కలిగించాలో అన్ని కలిగించానా?" అన్నాడు పానకాలరావు.

"అవునవును. బస్సు కోసం ఊరికి వేస్తున్న కచ్చా రోడ్డును ఆపడానికి శతవిధాల ప్రయత్నించి, ప్రయత్నించి పాపం అలసిపోయారు."

"ఆ రోడ్డు పొలాల మీదుగా వస్తున్నది. అలా రావడానికి వీల్లేదని పైవాళ్ళకు అర్జీలు పెట్టి ఆపించానా!"

"ఆ తరువాత గుట్టబందు నుంచి బంజరు భూములగుండా రోడ్డు వేసిరి కదా!"

"అది ఆపించడానికి వేయి రూపాయల దాకా తడిపిన తెల్సా?"

అయ్యో! అయ్యో! ఏ పేదవాని కూతురు పెళ్ళికి ఇచ్చినా పుణ్యం దక్కేది... ఈసారి కూడా అనలేదు సుందరమూర్తి – అనుకున్నాడు.

"ఆ బంజరు భూములల్ల చెట్లునాటి అడవులు పెంచుతం... రోడ్డు తేవద్దు అంటే విన్నారా?"

"ఊహుం. విన్లేదు. అడవిగుండా రోడ్డు రావచ్చు తప్పులేదు. రోడ్డు కిరువైపులా అడవి పెంచండి అని సలహా ఇచ్చారట కదా."

"ఆ భూముల్లో పశువులు మేత మేస్తుంటాయి. రోడ్డు పడి బస్సు నడిస్తే ఆ శబ్దానికి అవి బెదిరిపోయి మేత ముట్టవు అని ఎంత చెప్పినా వింటేనా..."

"కొత్తలో బెదురుతాయి. అలవాటైతే అవే పక్కకు తప్పుకుంటాయి. మేత మేస్తాయి అన్నారట కదా..."

"అంటార్రా – అంటారు. అదంతా పరమేశంగాడు అధికార్లకు నూరిపోసి అనిపించాడు. ఎన్ని అడ్డంకులు పెట్టినా పరమేశంగాడి హయాంలో ఊరికి రోడ్డు పడిందే, బస్సు కూడా వస్తున్నదే!"

"దొరగారూ, అలా స్తంభానికి తల గుద్దుకోకండి. అసలే పిల్లాజెల్లా గల ఇల్లు." అని పానకాలరావును ఆపి ఓదార్చాడు సుందరమూర్తి.

"అయిపోయింది సుందరమూర్తి, అయిపోయింది! ఇలాంటి పనులు చేసే పరమేశం గాడు తన పలుకుబడిని కొండమీది గడ్డివామంత ఎత్తుకు పెంచుకుంటాడు. వచ్చే ఎలక్షన్లలో గూడా వాడె గెలుస్తాడు. – నన్ను ప్రజాసేవ చేయనివ్వడు."

“గెలుస్తే గెలవని - ఎలక్షన్లలో గెలవడం తప్ప ప్రజాసేవకు వేరే మార్గాలె లేవా? నిజమైన ప్రజాసేవకులు ఎవరి వలన ప్రజాజీవితం బాగుపడినా సంతోషించాలి. కాని... ఇలా నిద్రాహారాలు మాని జీడిపప్పు నంజుకుంటూ, బ్రాందీ, విస్కీలు సేవించడం ఏమీ బాగలేదు.”

ఈసారి అనుకోలేదు- సుందరమూర్తి పైకే అన్నాడు. అసలు ఆ మాట చెప్పడానికే వచ్చాడు.

సుందరమూర్తి మాటలు వినిపించుకోలేదు పానకాలరావు.

ఓవర్ యాక్షన్ చేస్తున్న శకునిలా గడగడ ఓ విస్కీ బాటిల్ ఖాళీ చేశాడు.

❊❊❊

ఆ రోజే ఆగస్టు పదిహేను.

పండుగనాడు తలంటి పోసుకున్న పడతి మొహంలా ఊరు కళకళలాడుతోంది.

ఉదయం నుంచే జనం తమ ఊరికి మొట్టమొదటిసారిగా రాబోతున్న బస్సుకోసం ఎదురు చూస్తున్నారు.

బస్సు వచ్చి ఆగేచోట భద్రమ్మ భర్త వెంకటాద్రి ఓ గుడిసె వేసి చిన్న హోటలు తెరిచాడు. గారెలు, మదుగుబూలు, అరిశెలు చేయించి పెట్టాడు. అతని తమ్ముడు సారయ్య. మరదలు సీతాలు సహాయంగా ఉన్నారు. ఒక చెక్కబల్లమీద చుట్టలు, బీడీలు,పొగాకు కాడలు, అగ్గిపెట్టెలు పెట్టిఅమ్ముతున్నాడు. వాటితో ఆ చోటుకు కొత్తకళ వచ్చింది. ఒక చిన్న బజారు వెలిసింది.

బస్సు కోసం ఎదురుచూస్తున్న జనం హుందాగా వెంకటాద్రి గుడిసె హొటల్లో ఓ చాయ్ తాగి, బీడి కొనుక్కొని దమ్ము లాగుతున్నారు. తమ ఊరు అమాంతంగా ఎంతో ఎదిగిపోయినట్లు తోస్తున్నది వారికి.

ఊళ్లోకి బస్సు వస్తున్నదంటె ఎంత సందడి... ఎంత సందడి!

వచ్చే జనం...పోయే జనం... పేటకు ఊరికి మధ్య దూరం తగ్గిపోయి ఇక ఆ ఊరు రూపురేఖలే మారిపోతాయి అనుకుంటున్నారు.

ఆగస్టు పదిహేను...

ఒకవైపు స్వాతంత్ర్యదినోత్సవం.

మరోవైపు ఊరికి బస్సు వస్తున్నదన్న సంబరం.

మొత్తం మీద బస్సు వచ్చి ఆ ఊళ్ళో ఆగే ప్రదేశమంతా రంగు కాగితాల జెండాలతో, మామిడితోరణాలతో నిండిపోయింది.

వెంకటాద్రి గుడిసె హోటలుతోపాటు... ఊరి చివరి ఆ ప్రదేశమంతా రంగు కాగితాలతో నిండిపోయింది. రోడ్డుకు ఇరువైపు ఉన్న పూరిగుడిసెల్ని కూడా అలంకరించారు.

ఓ పాత గ్రామఫోనును లాక్కొచ్చి శాయశక్తులా దానితో సందడి చేయిస్తున్నారు.

పిల్లల ఆనందానికి పట్టపగ్గాలు లేవు. 'దొరోని ఇంట్ల పెండ్లి' లేకున్నా ఆ రోజు గ్రామఫోను మోగుతున్నందుకు వారికి తమాషాగా ఉంది. రంగుల జెండాలను చూస్తూ గ్రామఫోను పాటలు వింటూ ఎగిరి గంతులు వేస్తున్నారు.

'అదిగో బస్సు – ఇదిగో బస్సు' అని గాలికి రాలెచెట్టు ఆకులు గలగలా చప్పుడు చేసినా బస్సు శబ్దమే అనుకొని చెవులు రిక్కించి వింటున్నారు.

కళ్ళు నులుముకొని రోడ్డు కనిపించేంత మేర బస్సు కోసం చూస్తున్నారు.

కొందరికి అది కలా నిజమా అనిపిస్తున్నది. తమ ఊళ్ళోకి బస్సొస్తున్నదా! నిజంగా వస్తున్నదా! అని నమ్మలేకపోతున్నారు.

పానకాలరావు రోడ్డు పడకుండా, బస్సు రాకుండా అడ్డంకులు పెట్టాడని తెలిసిన వాళ్ళు, "వాడు ఎంతకైనా తెగిస్తాడు. బస్సు రాకుండా ఆపిస్తాదు సూడుండ్రి" అనుకుంటున్నారు.

అయితే వారి అంచనాలను తలకిందులు చేస్తూ ఊరికి బస్సు రానేవచ్చింది.

రోడ్డు కిరువైపులా గుమిగూడిన జనం ఆనందోత్సాహాలకు అవధులు లేవు. పెద్ద పెట్టున అంతా హర్షధ్వానాలు చేశారు. ఒకరిమీద ఒకరు పడి బస్సును చూస్తున్నారు. ఇళ్ళలోంచి బయటికి పరుగెత్తుకొచ్చి చూస్తున్నారు.

ఎటు చూసినా ఉత్సాహం... ఆనందం... కేరింతలు... హర్షధ్వానాలు... ఆ హర్షధ్వానాలు క్రమంగా హాహాకారాలుగా మారాయి!

వస్తూనే బస్సు దారి తప్పి జనం మీదికి వెళ్ళింది.

జనం భయంతో ఆందోళనతో అటూ ఇటూ పరుగెత్తారు.

ఒక్కసారిగా ఆ ప్రదేశమంతా బీభత్సంగా తయారయింది. ఎటుచూసినా హాహాకారాలు... ఏడుపు–పెడబొబ్బలు–ప్రాణాలు అరచేత పట్టకొని పరుగెత్తుతున్నారు

జనం... పిల్లల కోసం తల్లులు, తల్లుల కోసం పిల్లల అరుపులు...ఏడుపులు!

జనంమీదుగా దూసుకుపోయినా బస్సు వెంకటాద్రి గుడిసె హోటలును నేలమట్టం చేసింది. పక్కనున్న మరో నాలుగు గుడిసెల్ని కూల్చి ఓ తాటిచెట్టుకు గుద్దుకొని ఆగిపోయింది.

కళ్లుమూసి తెరిచే లోపల అంతటి ఘోరం జరిగిపోయింది.

భర్త శవం మీద పడి భద్రమ్మ గోడు గోడున విలపిస్తున్నది. రక్తం మడుగులో ఉన్న భర్తను చూసి సీతాలు స్పృహ తప్పి పడిపోయింది.

కొనప్రాణంతో కొట్టుకుంటున్న తల్లిదండ్రుల్ని చూసి పిల్లలు, బస్సు టైర్ల కింద నలిగిపోయిన పిల్లల్ని చూసిన తల్లిదండ్రులు పేగులు అవిసిపోయేలా - గుండెలు తరుక్కుపోయెలా... రాళ్ళు కరిగిపోయేలా విలపిస్తున్నారు.

ఊరంతా శోకసముద్రంలో మునిగిపోయింది. గ్రామ్‌ఫోన్ కన్నీళ్లతో తడిసిపోయింది. మూగబోయింది!

మత్తులో ఉండి ఆ బస్సును తోలిన డ్రైవర్ ఆ మత్తులోనే కన్ను మూశాడు.

ఆ సంఘటన ఆనందాన్ని కలిగించింది ఒక్క పానకాలరావుకే !

పేట నుంచి ఊరికి వచ్చే దారిలో బస్సు డ్రైవర్‌కు మత్తు కాఫీ తాగించే ఏర్పాటు చేసింది ఆ మహానుభావుడే! ఆ ప్రజానాయకుడే!

తన పాచిక పారినందుకు ఆనందంతో ఉక్కిరి బిక్కిరైపోతూ ఏకబిగిన రెండు సీసాలు ఖాళీ చేశాడు.... ఆ సీసాల్లో ఉన్నది బ్రాంది కాదు...విస్కీ కాదు.... రక్తం! పచ్చి రక్తం.

*ఆంధ్రప్రభ వారపత్రిక, 14.1.1987*